ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం
జిల్లా వార్తలు

శనివారం 1 జూన్ 2024

గొడవ చేస్తే జైలుకే..!

- ఎన్నికల కమిషన్ వార్నింగ్
- వైసీపీ కౌంటింగ్ ఏజెంట్లలో గుబులు
- ఇప్పటికే వందలాది మందిపై రౌడీషీట్
- కేసులు.. జైళ్లు.. పరారీలతో శ్రేణుల్లో కలకలం
- కౌంటింగ్ ప్రక్రియపైనే అందరి దృష్టి
- మూడు రోజుల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం



పోలీసు బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న ఎస్పీ గౌతమిశాలి



అనంతపురం, మే 31(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు రోజులు దగ్గరపడ్డాయి. మూడు వారాలుగా ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం మరో మూడు రోజుల్లో తేలిపోనుంది. ప్రస్తుతం అందరి దృష్టి కౌంటింగ్‌పైనే కేంద్రీకృతమైంది. ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా ఈ ఎన్నికలు రణరంగాన్ని తలపించాయి. పోలింగ్ రోజున రాజకీయ ప్రత్యర్థులను అధికార వైసీపీ వర్గీయులు కవ్వించారు.. బెదిరించారు. దాడులకు తెగబడ్డారు. ఎన్నికల కమిషన్ ఈ సంఘటనలను సీరియస్‌గా తీసుకుంది. అల్లర్లు, దాడులకు పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించింది. ఫలితంగా తాడిపత్రి, కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాప్తాడు నియోజకవర్గాలలో వైసీపీతోపాటు టీడీపీ కూటమి వర్గీయులపైనా కేసులు నమోదయ్యాయి. పలువురిని అరెస్టు చేశారు. ఇప్పటికే 332 మందిపై రౌడీషీట్లు ఓపెన్ చేశారు. పరారీలో ఉన్నవారికోసం వేట సాగుతోంది. మరోవైపు శాంతిభద్రతలను కాపాడలేకపోయిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంది. సస్పెన్షన్, బదిలీ వేటు వేసింది. తాడిపత్రి అల్లర్లకు బాధ్యులను చేస్తూ... ఎస్పీ, డీఎస్పీ, సీఐపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ పరిణామాల నేపథ్యంలో కౌంటింగ్‌ను అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మునుపెన్నడూ లేనంత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు కనిపిస్తోంది. ఆ దిశగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ గౌతమిశాలి చర్యలు తీసుకుంటున్నారు.

గొడవ చేస్తే లోపలికే..

ఎన్నికల్లో గెలుపుకోసం అధికార పార్టీ చివరి ప్రయత్నాలను ప్రారంభించింది. కౌంటింగ్ ఏజెంట్లను ఏమాత్రం తగ్గొద్దని ఉసిగొల్పుతోంది. అభ్యర్థుల తరఫున కౌంటింగ్‌లో పాల్గొనే ఏజెంట్ల పాత్ర కీలకం. మరీ ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో కూటమి, వైసీపీ వర్గీయులు గట్టి పట్టుకు పోయే వాతావరణం కనిపిస్తోంది. సాధ్యమైనన్ని ఇన్‌వ్యాలీడ్ చేయించాలని వైసీపీ, అదే స్థాయిలో కౌంట్ అయ్యేలా చూడాలని కూటమి అభ్యర్థులు భావిస్తున్నారు. ఈ ప్రక్రియలో పోలింగ్ ఏజెంట్లు కీలకంగా మారనున్నారు. దీంతో వారి ఎత్తుగడలను పసిగట్టేందుకు ఏజెంట్ల కదలికలపై పోలీసులు నిఘా వేశారు. కౌంటింగ్ కేంద్రంలో గొడవలకు దిగినా, కౌంటింగ్‌కు అంతరాయం కలిగించినా అరెస్టు చేస్తామని ఇప్పటికే పోలీసు శాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు.

సజ్జల రెచ్చగొట్టే వ్యాఖ్యలతో...

ప్రభుత్వ సలహాదారు.. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. ఆ పార్టీ చీఫ్ కౌంటింగ్ ఏజెంట్ల శిక్షణా శిబిరంలో సజ్జల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. అవి కౌంటింగ్ కేంద్రాల్లో హింసను ప్రేరేపించేలా ఉన్నాయనే విమర్శలు వచ్చాయి. ఎన్నికల నిబంధనలు పాటించేవాళ్లు కౌంటింగ్‌కు వెళ్లొద్దని, అడ్డుకునే వాళ్లు, అడ్డం చెప్పేవాళ్లు మాత్రమే వెళ్లాలని సజ్జల 'దిశానిర్దేశం' చేశారు. ఈ వ్యాఖ్యలు ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తం అయ్యేలా చేశాయి. కౌంటింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా జిల్లా పోలీసు యంత్రాంగం భద్రతాచర్యలు తీసుకుంటోంది. కౌంటింగ్ కేంద్రంలో అభ్యర్థుల తరుపు ఏజెంట్లు మాత్రమే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఏజెంట్ పాస్ ఉన్నవారిని మాత్రమే లోపలకు అనుమతించేలా ఏర్పాట్లు చేసింది. కౌంటింగ్ సిబ్బందిని సైతం క్షుణ్ణంగా తనిఖీ చేసి, పాస్ ఉంటేనే లోనికి అనుమతిస్తారు. ఈ విషయంలో పోలీసులు మెతక వైఖరి అవలంభిస్తే అక్కడికక్కడే చర్యలు తీసుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరోవైపు కౌంటింగ్ కేంద్రాల్లో అలజడి సృష్టించినా, వాగ్వాదానికి దిగినా.. వెంటనే ఆ ఏజెంటును అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. దీన్నిబట్టి కౌంటింగ్ కేంద్రాల్లో చీమ చిటుక్కుమన్నా చర్యలు తప్పేలా లేవని స్పష్టమౌతోంది.

ఏజెంట్లలో అంతర్మథనం

'గొడవ చేస్తే అరెస్టు చేస్తాం' అని పోలీసు శాఖ వార్నింగ్ ఇవ్వడంతో కౌంటింగ్ ఏజెంట్లుగా వెళ్లే నాయకులు, కార్యకర్తల్లో అంతర్మథనం మొదలైంది. అక్కడ ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. సజ్జల వ్యాఖ్యలు వైసీపీ ఏజెంట్లలో మరింత గుబులు రేపుతున్నాయి. వైసీపీ ఏజెంట్ల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నట్టుగా మారింది. కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్ల కారణంగా ఏ చిన్న గొడవ జరిగినా అరెస్టు చేయాలని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో పార్టీ అభ్యర్థి కోసం వాగ్వాదానికి దిగితే తమ పరిస్థితి ఏమిటని వైసీపీ ఏజెంట్లు ఆందోళన చెందుతున్నారు. కేసుల్లో ఇరుక్కుని కటకటాలపాలైతే తమ కుటుంబాలకు దిక్కెవరని ఆలోచనలో పడ్డారు. ఎన్నికల గొడవల నేపథ్యంలో ఇప్పటికే వందలాది మందిపై కేసులు నమోదయ్యాయి. పలువురు జైళ్లకు వెళ్లారు. అంతకు మించి.. పరారీలో ఉన్నారు. రౌడీషీట్లు తెరవడంతో తమ భవిష్యత్తు నాశనమైందని వాపోతున్నారు. జీవితాంతం స్టేషన్ చుట్టూ తిరగాల్సిందే అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం కౌంటింగ్ ప్రక్రియపై కనిపిస్తోంది. ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియ ముగిస్తే చాలు అని ఏజెంట్లు చర్చించుకుంటున్నారు.

కౌంటింగ్ కేంద్రం చుట్టూ రెడ్‌జోన్

4న జిల్లా అంతటా హై అలర్ట్: ఎస్పీ గౌతమిశాలి

అనంతపురం క్రైం, మే 31: నగరంలోని జేఎన్‌టీయూ కౌంటింగ్ కేంద్రం చుట్టూ 3 కి.మీ. పరిధిని రెడ్ జోన్‌గా ప్రకటించామని ఎస్పీ గౌతమి శాలి తెలిపారు. ఆ ప్రాంతంలో ఎవరూ డ్రోన్లు ఎగురవేయరాదని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జేఎన్టీయూ చుట్టూ 5 కి.మీ. పరిధిలో శుక్రవారం ఉదయం, సుభాష్ రోడ్డులో సాయంత్రం పోలీసు బలగాల చేత భారీ ఎత్తున ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎస్పీ పాల్గొని, చట్టవ్యతిరేక శక్తులకు హెచ్చరికలు జారీ చేశారు. కౌంటింగ్ ముగిసేవరకు జేఎన్టీయూ, పరిసరాలు పోలీసుల గుప్పిట్లో ఉంటాయనే సంకేతాలు వెళ్లేలా ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. కౌంటింగ్ సమయంలో గొడవల జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్పీ సూచించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, పోలీసులకు సహకరించాలని కోరారు. జేఎన్టీయూ, పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రజలు గుమిగూడటం చట్టవిరుద్ధమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, ఎవరూ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద దృశ్యాలను కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పోలీసు అధికారులు చూస్తూ.. పర్యవేక్షిస్తారని తెలిపారు. కౌంటింగ్ జరిగే 4వ తేదీన జిల్లా అంతటా హై అలర్ట్ ప్రకటించామని అన్నారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాల్లోని సమస్యాత్మక కాలనీలు, గ్రామాల్లో నిఘా వేశామని తెలిపారు. జిల్లాలో సమస్యలు సృష్టిస్తారనే అనుమానం ఉన్న 5,978 మందిని బైండోవర్ చేయించామని తెలిపారు. పోలింగ్ రోజున జరిగిన అల్లర్లు, ఘర్షణలు, పాత కేసులను పరిగణలోకి తీసుకుని జిల్లా వ్యాప్తంగా 332 మందిపై రౌడీషీట్లు ఓపెన్ చేశామని తెలిపారు. ఇప్పటి వరకూ 216 ఫ్లాగ్‌మార్చ్‌లు, 105 కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు, 934 గ్రామ సందర్శనలు నిర్వహించామని, 292 మందిని అరెస్టు చేశామని, 1621 మంది రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, హిస్టరీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు.

మరో 61 మందిపై రౌడీషీట్

ఎన్నికల్లో ఘర్షణలకు పాల్పడిన మరో 61 మందిపై పోలీసులు శుక్రవారం రౌడీషీట్లు ఓపెన్ చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా 253 మందిని బైండోవర్ చేశారు. 96 మంది ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఐదుచోట్ల కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు, 14 చోట్ల ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహించారు. నగరంలో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌లలో డీఎస్పీ టీవీవీ ప్రతాప్, ఏఆర్ డీఎస్పీ మునిరాజ, గ్రేహౌండ్స్ డీఎస్పీలు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ డీఎస్పీలు, బలగాలు, సీఐలు రెడ్డప్ప, ధరణికిషోర్, నారాయణరెడ్డి, ఆర్ఐలు రెడ్డప్పరెడ్డి, రాముడు, మధు, అనంతపురం పీటీసీ అధికారులు, స్పెషల్ పార్టీ పోలీసులు, నగర పోలీసులు, సిబ్బంది ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్నారు.

తాడిపత్రిలో 46 మందిపై...

తాడిపత్రి టౌన్: రాళ్లదాడి కేసులో నిందితులైన టీడీపీ, వైసీపీకి చెందిన 46 మందిపై శుక్రవారం రౌడీషీట్ ఓపెన్ చేశామని డీఎస్పీ జనార్దన్‌నాయుడు తెలిపారు. వీరిలో టీడీపీ వర్గీయులు 23 మంది, వైసీపీ వర్గీయులు 23 మంది ఉన్నారని తెలిపారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల గొడవల రౌడీ షీటర్ల సంఖ్య 197కు చేరింది.

రాళ్లదాడి కేసులో తొమ్మిది మంది అరెస్ట్

ఎన్నికల సందర్భంగా పట్టణంలో జరిగిన రాళ్లదాడి కేసుకు సంబంధించి 9మంది టీడీపీ మద్దతుదారులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో తాడిపత్రి తూర్పుపాలెంకు చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి, రాయచూరువీధికి చెందిన రోషన్‌జమీర్, చింతల హరినాథ్‌రెడ్డి, నందలపాడుకు చెందిన కృపాకర్, పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జూటూరుకు చెందిన జేసీ సుదీప్‌రెడ్డి, నరసాపురానికి చెందిన వెన్నపూస విజయభాస్కర్ రెడ్డి, పుట్లూరు మండలం శనగలగూడూరుకు చెందిన విజయకుమార్‌రెడ్డిలు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. వీరిని ఉరవకొండ కోర్టులో హాజరుపరిచిన అనంతరం కడప జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఆంజనేయుడికి ఫలాలంకరణ

నేడు హనుమజ్జయంతి వేడుకలు





నేడు హనుమజ్జయంతి

గుంతకల్లు, మే 31: దక్షిణాది హనుమజ్జయంతిని పురస్కరించుకుని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని శుక్రవారం ఉదయం పండ్లతో అలంకరించారు. వేకువనే స్వామివారి మూల విరాట్టుకు అభిషేకాలు నిర్వహించారు. పండ్లతో అలంకరించి.. భక్తులకు దర్శనం కల్పించారు. హనుమజ్జయంతి సందర్భంగా ఆలయంలో అష్టోత్తర శత కుంభాభిషేకాన్ని నిర్వహించారు. అర్చన వేద, సుందరకాండ, మన్యుసూక్త పారాయణం, హోమాలు, స్వామివార్ల మూల మంత్ర జపాలను చేపట్టారు. మధ్యాహ్నం మహా మంగళహారతి, సాయంత్రం మల్లెలతో లక్షార్చన, యాగశాలలో ఆరాధన నిర్వహించారు. వేదగోష్టి, హారతి కార్యక్రమాలను చేట్టారు. కార్యక్రమాలలో ఆలయ ఈఓ వై. భద్రాజీ, ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ కె.సుగుణమ్మ, ట్రస్టుబోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కసాపురం ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, పూజలను నిర్వహిస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు, సిబ్బంది ఆలయాన్ని మూసేంతవ వరకూ విధుల్లో ఉండాలని ఈఓ ఆదేశించారు.

పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు కొత్త మార్గదర్శకాలు

జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్



అనంతపురం టౌన్, మే 31: పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు కేంద్ర ఎన్నికల కమిషన్ కొత్త మార్గదర్శకాలను జారీచేసిందని, ఆ ప్రకారమే కౌంటింగ్ చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు నియమితులైన అడిషనల్ ఏఆర్‌ఓలు, అసిస్టెంట్ ఏఆర్‌ఓలకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. పోస్టల్ బ్యాలెట్‌లో కవరు, ఆథరైజేషన్ లెటరు, బ్యాలెట్ (సీఏబీ) ముఖ్యమైనవని అన్నారు. ఆథరైజేషన్‌లో ఎన్నికల కమిషన్ తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. సందేహాలు వస్తే ఉన్నతాధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. పొరపాటు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జేసీ కేతన్ గార్గ్, జడ్పీ సీఈఓ నిదియ, నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు..సొల్లు..!

● కాలనీలు కాదు.. ఊళ్లకు ఊళ్లు అన్నారు..
● సీఎం జగన్‌వి అన్నీ ఉత్త మాటలే ● ఇళ్ల లబ్ధిదారుల ఆగ్రహం ● బిల్లుల జాప్యంతో పడకేసిన నిర్మాణాలు


అలమూరు జగనన్న లేఅవుట్‌లో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణం



అనంతపురం, సిటీ, మే31: జగనన్న కాలనీ పేరుతో ఇళ్లు కాదు..ఊళ్లు నిర్మిస్తాం..ప్రతి పేదవారి సొంతింటి కల నెరవేరుస్తాం..అన్న సీఎం జగన్ మాటలు ఉత్తిత్తివే అని తేలిపోయాయి. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణంలో అటు వైసీపీ ప్రభుత్వం..ఇటు అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లా వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలు పడకేశాయి. మొండి గోడలు, అరకొర నిర్మాణాలతో కాలనీలు బోసిగా దర్శనమిస్తున్నాయి. ఐదేళ్లుగా అరకొరగా సాగిన నిర్మాణాలు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో మరింత దయనీయంగా మారాయి. పైగా ప్రభుత్వం ఇసుక, సిమెంట్ తదితర సామగ్రి సకాలంలో సరఫరా చేయకపోవడం.. బిల్లుల జాప్యంతో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం పెనుభారంగా మారింది. సొంతింటి నిర్మాణంపై కోటి ఆశలు పెట్టుకున్న తాము నేడు నిలువ నీడ లేకుండా పోయామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్దెలు కట్టలేక అప్పులపాలయ్యామంటున్నారు. ఏది ఏమైనా జిల్లావ్యాప్తంగా జగనన్న ఇళ్ల నిర్మాణాల పరిస్థితి దయనీయంగా మారింది.

జిల్లాలో జగనన్న కాలనీల పరిస్థితి ఇదీ..

- మంజూరైన ఇళ్ల సంఖ్య : 72,457
- పూర్తయిన ఇళ్ల సంఖ్య : 28,021
- నిర్మాణానికి నోచుకోని ఇళ్ల సంఖ్య : 8,161
- నిర్మాణంలో ఉన్న ఉన్న ఇళ్ల సంఖ్య : 36,275
- పెండింగ్ బిల్లులు.. సుమారు రూ.50 కోట్లు

లబ్ధిదారులకు తప్పని అవస్థలు

జిల్లాలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ఆశించిన స్థాయిలో జరగలేదు. ఇసుక, సిమెంట్ సరైన సమయానికి సరఫరా చేయకపోవడం, బిల్లులు సకాలంలో ఇవ్వక పోవడంతో లబ్ధిదారులు అప్పులపాలు కావాల్సి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు పథకం తీరు జిల్లా వ్యాప్తంగా అభాసుపాలయ్యిందనే విమర్శలు లేకపోలేదు. ఏళ్ల తరబడి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో బాధిత లబ్ధిదారులకు సొంతింటి కల మరింత జాప్యమైంది. సొంతింటి కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు చూడాల్సిన దుస్థితి నెలకొంది.

ఇసుక, సిమెంట్ సరఫరా అంతంతే

జిల్లాలో ప్రధానంగా అనంతపురం, రాప్తాడు, తాడిపత్రి, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణ పరిస్థితి దయనీయంగా మారింది. వీటికితోడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రూ. 1.80లక్షలు ఇంటి నిర్మాణానికి ఏమాత్రం సరిపోకపోయినా.. సొంతింటి కల కోసం చాలా మంది లబ్ధిదారులు నానా అవస్థలు పడి నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వం లబ్ధిదారులు ఎంచుకున్న ఆప్షన్ ప్రకారం ఇసుక, సిమెంట్ సరఫరా చేయాల్సి ఉంది. ప్రభుత్వం అరకొరగా అందించడంతో అవి సరిపోక నిర్మాణాలు ఆగిపోయాయి. కొందరు లబ్ధిదారులు అప్పులు చేసి మరీ ఇళ్లు కట్టించుకున్నామని వాపోతున్నారు.

బిల్లుల మంజూరులో జాప్యం

జగనన్న కాలనీల్లో అప్పులు చేసి నిర్మించుకున్న ఇళ్లకు సైతం బిల్లులు సకాలంలో రాకపోవడంతో లబ్ధిదారులకు మరింత ఆవేదన తప్పడం లేదు. బిల్లుల జాప్యంతోనే చాలా మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి జంకుతున్నారు. ఇప్పటికే జిల్లాలో రూ. 50 కోట్లకు పైగానే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. ఏదీ ఏమైనా జగనన్న ఇళ్ల పరంగా సీఎం జగన్ చెప్పిన మాటలకు.. జిల్లాలో క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేకుండా పోయింది. ఇళ్లు కాదు కాలనీల పేరుతో ఊళ్లకు ఊళ్లు నిర్మించి ఇస్తామని మాట ఇచ్చిన జగన్ తమను అప్పుల పాలు చేశారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల కాలంలో జగనన్న కాలనీలు చూస్తే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైందన్న విషయం స్పష్టంగా అర్థమవుతోంది.



కొంత మేర ఇళ్ల నిర్మాణం తగ్గింది..

- నరసింహారెడ్డి, ఇన్‌చార్జి పీడీ జిల్లా గృహ నిర్మాణశాఖ



ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో కొంత వరకు ఇళ్ల నిర్మాణాలు తగ్గిన విషయం వాస్తవమే. అయితే ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని చూస్తున్నాం. పెండింగ్ బిల్లుల విషయం ప్రభుత్వానికి ఇదివరకే నివేదించాం. సిమెంట్, ఇసుక తదితర సామగ్రి సకాలంలో సరఫరా అయ్యే విధంగా చూస్తాం. లబ్ధిదారులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

కరెంటు కష్టాలు తీరేదెన్నడో..?

పాలకుల పాపం.. ప్రజలకు శాపం..
చిన్న పాటి గాలివానకే ఆగిపోతున్న విద్యుత్ సరఫరా
నాలుగు రోజులు అల్లాడిన 20 గ్రామాల ప్రజలు
రూ.2 కోట్లతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
టీడీపీ హయాంలో ప్రతిపాదనలు
ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ పాలకులు


నేలకు ఒరిగిన విద్యుత్ స్తంభం

విడపనకల్లు, మే 31: చిన్నపాటి గాలీవాన వచ్చినప్పుడల్లా విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. స్తంభాలు కూలిపోవడంతో సరఫరాను ఆపివేస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం వైసీపీ పాలకులు కూడా ఇటువైపు చూడలేదు. విద్యుత్ లేక ఆయా గ్రామాల ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రకృతి విపత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవటం సహజమే. ప్రస్తుతం ఎంతో టెక్నాలజీని అందిపుచ్చుకున్న ఈ కాలంలో కూడా విద్యుత్ సరఫరా ఆగిపోతే నాలుగు రోజులపాటు 20 గ్రామాల ప్రజలు నరకం చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఐదు సంవత్సరాలు కాలంలో ప్రతీ ఏటా ఈదురు గాలులు, వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలు కూలిపోయి సరఫరా నిలిచిపోయిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అయితే వారం రోజుల క్రితం కురిసిన గాలీవానకు విడపనకల్లు, వీ కొత్తకోట, మాళాపురం, వేల్పుమడుగు, పెద్ద కొట్టాలపల్లి, జనార్ధనపల్లి, ఆర్ కొట్టాల, డొనేకల్లు, కడదరబెంచి, గడేకల్లు, అంచనహాలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో ప్రజలు కరెంటు లేక చీకట్లో మగ్గాల్సి వస్తోంది. గుంతకల్లు నుంచి విడపనకల్లు మండలానికి 33/11 కేవీ విద్యుత్ సరఫరా అవుతోంది. గుంతకల్లు నుంచి 35 కి.మీ పొడవునా విద్యుత్ స్తంభాలు ఎక్కడ కూలిపోయాయో గుర్తించడానికే ఒక రోజు సమయం పడుతుంది. కూలిన విద్యుత్ స్తంభాలను గుర్తించి అధికారులు వారం పది రోజులు శ్రమించి విద్యుత్‌ను సరఫరా చేయిస్తున్నారు. ఈ పరిస్థితి లేకుండా అప్పటి టీడీపీ ప్రభుత్వం విడపనకల్లు మండలానికి డబుల్ ఫీడర్ లైన్ ఉండాలని ప్రత్యామ్నాయంగా కేవలం గంట వ్యవధిలోనే విద్యుత్ సరఫరా అందించేందుకు ఉరవకొండ నుంచి 33/11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటుకు రూ.2 కోట్లకు పైగా ప్రతిపాదనలు పంపింది. అయితే ప్రభుత్వం మారడంతో ఆ పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి అధికారులు గాని, వైసీపీ నాయకులు గాని పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో మండలంలోని 20 గ్రామాల ప్రజలకు గాలీవాన వస్తే చాలు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు, అధికార పార్టీ నాయకులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. ఎన్ని రోజులైనా గ్రామాలు అంధకారంలో ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. గుంతకల్లు లైన్‌లో సమస్యలు వస్తే వెంటనే ఉరవకొండ లైన్ ద్వారా విద్యుత్‌ను ప్రత్యామ్నాయంగా ఇవ్వాలనే ఆలోచన ఎవరికీ లేక పోవటం ఏమిటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కానీ అధికార పార్టీ నాయకులకు మేలు జరిగేలా గడేకల్లులో రూ.కోటికి పైగా నిధులు వెచ్చించి కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి మాత్రం భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారు. ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాటు చేయలేదుకాని వారి అనుచరుల జేబులు నింపే పనులు మాత్రం చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

నాలుగు రోజులు చీకట్లో ఉన్నాం



చిన్న గాలీవానకు గంతకల్లు వద్ద కరెంటు స్తంభాలు పడిపోయాయని నాలుగు రోజులు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బస్టాండ్ వద్ద టీకొట్టు పెట్టుకున్నాను. కరెంటు లేక వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. అధికారులు గాని, వైసీపీ నాయకులు గాని పట్టించుకోలేదు. ప్రత్యామ్నాయంగా విద్యుత్ ఇవ్వాలని ఎవరూ ఆలోచించిన పాపాన పోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- అంజి, విడపనకల్లు

టీడీపీ హయాంలో ప్రతిపాదనలు



ప్రతి సంవత్సరం గాలీవానకు గుంతకల్లు వద్ద విద్యుత్ స్తంభాలు పడిపోతున్నాయి. వాటిని రిపేరి చేసేందుకు వారం రోజుల సమయం పడుతోంది. కరెంటు పోయిన గంటకో రెండు గంటలకో విద్యుత్ సరఫరా పునరుద్ధరించాల్సిన అధికారులు వారం రోజులైనా పట్టించుకోవడం లేదు. నాలుగు రోజులు కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. తక్షణం అధికారులు విద్యుత్‌ను పునరుద్ధరించాలి. **- మోహన్, విడపనకల్లు**

విద్యుత్ లేక తాగునీరు రావడం లేదు



నాలుగు రోజులు విద్యుత్ లేకపోవటంతో తాగేందుకు నీరు కూడా లేవు. రాత్రి సమయాల్లో విషపురుగుల భయంతో అల్లాడిపోతున్నాం. ఎండవేడిమికి ఎక్కడి నుంచి ఏ విషపురుగు వస్తుందో అని భయంగా గడుపుతున్నాం. ఉరవకొండ, పాల్తూరు సబ్ స్టేషన్ల నుంచి గంట, రెండు గంటల్లో విద్యుత్ ఇవ్వాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదెక్కడి ప్రభుత్వమో అర్థం కావటంలేదు. **-బసన్న, విడపనకల్లు**

పట్టించుకునే వారే లేరు..



టీడీపీ ప్రభుత్వంలో ఉరవకొండ నుంచి ప్రత్యామ్నాయంగా విద్యుత్ లైన్లు ఏర్పాటకు ప్రతిపాదనలు పంపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ ప్రతిపాదనను తుంగలో తొక్కి మండలానికి విద్యుత్ సరఫరా లేకుండా చేశారు. వారం పది రోజులు కరెంటు పోతే కూడా వైసీపీ నాయకులు ఒక్కరూ పట్టించుకోలేదు. నాలుగు రోజులు 20 గ్రామాల ప్రజలు చీకట్లోనే ఉండాల్సి వచ్చింది. మాకు ఈ దరిద్రం ఎప్పుడు పోతుందో ఏమో.

- ఎర్రిస్వామి, విడపనకల్లు

జీబీసీ, హంద్రీనీవా ఈఈల నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, మే 31: హంద్రీనీవా సుజల స్రవంతి పథకం గుంతకల్లు డివిజన్ ఈఈగా శ్రీనివాసనాయక్, హెచ్చెల్సీ పరిధిలోని గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ) ఈఈగా వెంకటరమణలను నియమిస్తూ జలవనరుల శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. హంద్రీనీవా గుంతకల్లు ఈఈ రామకృష్ణ యాదవ్, హెచ్చెల్సీ జీబీసీ ఈఈ మోహన్‌మూర్తి శుక్రవారం పదవీవిరమణ పొందారు. దీంతో హెచ్‌ఎన్ఎస్ఎస్ గుంతకల్లు ఈఈగా అదే డివిజన్‌లో డీఈగా పనిచేస్తున్న శ్రీనివాసనాయక్‌కు, చెన్నేకొత్తపల్లి డీఈగా పనిచేస్తున్న వెంకటరమణలకు హెచ్చెల్సీ జీబీసీ ఈఈగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయా స్థానాల్లో ఇద్దరు ఈఈలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, మే 31: నిరుద్యోగ యువతీ, యువకులకు 'ఉన్నతి' ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిప్లమా, డిగ్రీ చదివి 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. 35రోజుల పాటు బెంగుళూరులో శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం నెలకు రూ.15 వేల కనీస వేతనంతో ఉద్యోగం కల్పిస్తామన్నారు. జూన్ 6వతేదీ నుంచి ప్రారంభించే శిక్షణకు, పేర్ల నమోదు మరిన్ని వివరాలకు సెల్ నంబరు 90004 87423ను సంప్రదించాలని కోరారు.

సహకార శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, మే 31: కోఆపరేటివ్ డిప్లమా మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్ 9వ బ్యాచ్ 24వారాల సహకార శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని రాయలసీమ సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సహకార సంస్థలు, సహకార సొసైటీల్లో పనిచేస్తున్న సిబ్బంది సహకార శిక్షణ తప్పనిసరిగా పూర్తి చేసి ఉండాలని నిర్దేశించినందున సహకార చట్ట పరిధిలో రిజిస్టర్ అయిన సహకార సొసైటీల పాలకవర్గాలు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సహకార సొసైటీలు, సహకార బ్యాంకులు, సహకార సంస్థలలో పనిచేస్తున్న సిబ్బందికి పదోతరగతి ఉత్తీర్ణత, ఇతరులు ఇంటర్, సమాన అర్హత గల వారు డిప్లమా కోర్సుకు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోగా రామ్‌నగర్‌లోని రాయలసీమ శిక్షణ కేంద్రంలో స్వయంగా దరఖాస్తులను అందజేయాలన్నారు. వివరాలకు 9490741137 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ట్విస్టు మీద ట్విస్టు..!

● సమగ్రశిక్ష ఏపీసీ పోస్టు మాకొద్దంటే.. మాకొద్దు..
● జడ్పీ సీఈఓ నిదియాదేవికి అప్పగిస్తూ ఉత్తర్వులు
● విద్యాశాఖకు తొలిసారి ఐఏఎస్ అధికారి


నిదియాదేవి

అనంతపురం విద్య, మే 31: ఏదైనా ఉన్నతాధికారి సీటు ఖాళీ అయిందంటే.. ఆ స్థానం కోసం అధికారులు పోటీ పడడం సహజం. అనంతపురం సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పోస్టంటేనే అధికారులు బెంబేలెత్తుతున్నారు. 'మాకొద్దు బాబోయ్' అంటూ విద్యాశాఖ అధికారులు చేతులెత్తేయడంతో మళ్లీ రెవెన్యూశాఖ చేతుల్లోకి వెళ్లింది. రెవెన్యూశాఖ నుంచి వచ్చిన వరప్రసాద్ ఏపీసీగా పని చేశారు. శుక్రవారం ఆయన ఉద్యోగ విరమణ చేశారు. మొదట ఏపీసీగా డీఈఓ వరలక్ష్మీ, తర్వాత ఏడీ నాగరాజు పేర్లు వినిపించినా... అనూహ్యంగా... జడ్పీ సీఈఓ పేరు ఖరారయ్యింది. శుక్రవారం జడ్పీ సీఈఓ నిదియా దేవి సమగ్రశిక్ష ఏపీసీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నియామకం వెనక అనూహ్య మలుపులు తిరిగినట్లు సమాచారం. విద్యాశాఖ కీలక పదవి మళ్లీ రెవెన్యూ శాఖకే చేరడం చర్చనీయాంశమయ్యింది.

మొదట ఏడీ, తర్వాత డీఈఓనా...?

ఏపీసీగా వరప్రసాద్ రిటైర్డ్ కావడానికి ముందే జిల్లా విద్యాశాఖలో ఏడీగా పనిచేస్తున్న నాగరాజుకు ఏపీసీ బాధ్యతలు అప్పజెప్పాలని జిల్లా విద్యాశాఖాధికారులు తీవ్రంగా ప్రయత్నించారు. ఇదే విషయం కలెక్టర్‌కు కూడా వివరించి, ఉత్తర్వులు కూడా తయారు చేయించినట్లు తెలుస్తోంది. ఉన్నఫళంగా జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మిని ఏపీసీగా నియమిస్తూ.. సమగ్రశిక్ష స్టేట్ ప్రాజక్టు డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఏపీసీగా పనిచేయడానికి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు, పనిఒత్తిడి ఇతర కారణాల వల్ల డీఈఓ అయిష్టత చూపినట్లు సమాచారం. దీంతో ఏడీగా పనిచేస్తున్న నాగరాజుకే ఏపీసీ బాధ్యతలు అప్పజెప్పాలని జిల్లా విద్యాశాఖలో విశ్వప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. ఈ విషయంలో అధికారులు సఫలం కూడా అయ్యారు. ఇంతలో డీఈఓకు ఏపీసీగా స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు రావడంతో... ఎలాగైనా ఏడీనే ఏపీసీగా కొనసాగించేలా..... ఎస్పీడీకి ర్యాటిఫికేషన్ కూడా రాసేలా జిల్లా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఎపిసోడ్‌లో అటు డీఈఓ, ఇటు ఏడీ ఇద్దరూ సమగ్రశిక్ష ప్రాజెక్టు ఏపీసీగా పనిచేయడానికి ఇష్టంగా లేరని గ్రహించిన కలెక్టర్ అనూహ్యంగా జడ్పీ సీఈఓ నిదియాదేవిని తెరపైకి తెచ్చినట్లు సమాచారం. అందులో భాగంగానే నిదియాదేవికి ఏపీసీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ...కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం వరప్రసాద్ బాధ్యతలు అప్పగించగా, నిదియాదేవి సమగ్రశిక్ష ఏపీసీగా బాధ్యతలు స్వీకరించారు.

తొలిసారి ఐఏఎస్...

సమగ్రశిక్షకు తొలిసారి ఐఏఎస్ అధికారిని ఏపీసీగా నియమించారు. గతంలో పీఓగా ఉన్న ఈపోస్టును ఏపీసీగా మార్చారు. అయితే సమగ్రశిక్ష పీఓగా లేదా ఏపీసీగా ఇంత వరకూ ఎవరూ ఐఏఎస్ అధికారులు రాలేదు. డీఈఓలు, ఏడీలు, ఇతర శాఖల నుంచి వచ్చిన ప్రొఫెసర్లు, ఆర్డీఓలు మాత్రమే పనిచేశారు. కీలకమైన విద్యాశాఖ పోస్టు రెవెన్యూ శాఖకు చేరడం విశేషం.

ముగిసిన 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

అనంతపురం విద్య, మే 31 : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు సోషల్ పరీక్ష నిర్వహించారు. 45 కేంద్రాల్లో జరిగిన పరీక్షల్లో 4,774 మందికిగాను 2,696 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా.. 2078 మంది హాజరయ్యారు. పరీక్షకు హాజరైన వారి కంటే గైర్హాజరైన వారే అధికంగా ఉండడం గమనార్హం. శనివారం నుంచి ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. 7 కేంద్రాల్లో 1391 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జూన్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

అనంతపురం టౌన్, మే31: నగరంలోని జేఎన్‌టీయూలో 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. అనంతపురం పార్లమెంట్ సహా, ఎనిమిది నియోజకవర్గాల ఓట్లను ఇక్కడే లెక్కించనున్నారు. దీంతో పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకున్నారు. మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు.

కౌంటింగ్ మొదలయ్యేది ఇలా..

కౌంటింగ్ ప్రక్రియ పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో ప్రారంభమవుతుంది. అరగంట తర్వాత ఈవీఎంల ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. పోలింగ్ స్టేషన్‌వారీగా ఈవీఎంలను టేబుల్స్ వద్దకు తీసుకొచ్చి ఏజెంట్ల సమక్షంలో లెక్కింపు ప్రారంభిస్తారు. ప్రతి ఈవీఎంలో రౌండ్ల వారీగా ఎవరెవరికి ఎన్ని ఓట్లు వచ్చాయని ఆర్‌ఓలు అధికారికంగా ప్రకటిస్తారు. ప్రతి అసెంబ్లీకి 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తారు. ఉరవకొండ నియోజకవర్గానికి 18 టేబుల్స్ ఏర్పాటు చేయనున్నారు.

ఏజెంట్లకు నిబంధనలివే..

- కౌంటింగ్ ఏజెంట్‌గా నియమితులైనవారు జూన్4వతేదీన ఉదయం ఆరు గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి.
- ఫారం18డిక్లరేషన్, డ్యూటీ ఆర్డర్, జారీచేసిన ఐడీ, ఆధార్‌కార్డు, ఒకఫోటో, ఒకనోట్‌బుక్, పెన్, ఫారం-17సీ తీసుకొని హాజరు కావాలి
- సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. ఒకసారి కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లిన తర్వాత బయటకు రావడానికి అనుమతించరు. కేటాయించిన టేబుల్ వద్దే కూర్చోవాలి.
- కౌంటింగ్ సిబ్బంది ఫెన్సింగ్ లోపల ఉంటారు. ఏజెంట్లు వెలుపల కూర్చోవాలి. లోపలికి అనుమతించరు.
- పార్లమెంటు, అసెంబ్లీకి వేరువేరు టేబుల్స్ ఉంటాయి, ఎం అని నోట్ చేసి ఉంటే మీకు వచ్చిన సీయూలో మాక్‌పోల్ డిఫెక్ట్ ఉన్నట్లు, డీ, అని నోట్‌చేసి ఉంటే మీరు రిజల్ట్ చెక్ చేయాలన్నట్లు తెలుసుకోవాలి.
- పొరపాటున పీఓలు ఈవీఎంలకు క్లోజింగ్ బటన్ నొక్కి ఉండకపోతే వాటిని క్లోజ్ చేసిన తర్వాత ఫలితాలు చూసుకోవాలి.
- ఒక్కో టేబుల్ వద్ద సూపర్‌వైజర్, అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. వీరితో పాటు నియోజకవర్గ ఆర్‌ఓ, ఏఆర్‌ఓకూడా అక్కడే ఉంటారు.

సరిహద్దుల్లో కొనసాగుతున్న సర్వే

రాయదుర్గం, మే 31: ఏపీ, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఇనుప గనుల వద్ద శుక్రవారం రెండో రోజు సర్వే కొనసాగింది. అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలం సిద్దాపురం, మలపనగుడి గ్రామాల సమీపంలో ఉన్న కొండల్లో కేంద్ర బృందం సర్వే నిర్వహించింది. కర్ణాటకలోని ఏడు గనుల లీజు గడువు పూర్తి కావడంతో రెన్యువల్ చేయడం కోసం ఈ సర్వే నిర్వహిస్తున్నారు. రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదం ఉండటంతో ఖచ్చితమైన సరిహద్దులను గుర్తించేందుకు అధికారులు రెండురోజులుగా కసరత్తు చేస్తున్నారు. గనుల యజమానుల వద్ద ఉన్న లీజు రికార్డులు, ప్రభుత్వం వద్ద ఉన్న లీజు సరిహద్దు రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహిస్తున్నారు. రెండు రాష్ట్రాల మైనింగ్, అటవి, రెవెన్యూ శాఖల అధికారులు, భూరికార్డుల అధికారులు సర్వేలో పాల్గొంటున్నారు. విఠలాపురం, టుముటి గ్రామాల చిత్రపటాలు, ఆ గ్రామాలకు ఆనుకుని ఉన్న సిద్దాపురం, మలపనగుడి గ్రామాల చిత్రపటాలను పరిశీలించి.. క్షేత్రస్థాయిలో కొలతలు తీస్తున్నారు. గనుల యజమానులకు లీజు సమయంలో కేటాయించిన సరిహద్దులను గుర్తించి, అనంతరం గ్రామాల సరిహద్దులను నిర్ధారిస్తున్నారు. ఇప్పటివరకు ప్రాథమికంగా గనులకు సంబంధించిన సరిహద్దులను గుర్తించినట్లు తెలిసింది. జూన్ ఆరో తేదీ వరకు పూర్తిస్థాయి సర్వే నిర్వహించి, కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. సర్వే ప్రక్రియలో ప్రొఫెసర్ సూరత్ హర్షవర్ధన్, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ రూప్లానాయక్, కర్ణాటక సీనియర్ జియాజిలిస్టు చంద్రు, సర్వేయర్ రవితేజ పాల్గొంటున్నారు.


గనుల ప్రాంతంలో సర్వే చేస్తున్న అధికారులు

చీనీకాయలు టన్ను రూ.37 వేలు

అనంతపురం రూరల్, మే 31: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.37 వేలు, కనిష్ఠంగా రూ.16 వేలు, సరాసరి రూ.24 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 564 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.




కోర్టురోడ్డులో అభయాంజనేయస్వామి ఆలయ అలంకరణ


హౌసింగ్‌బోర్డులో ముస్తాబైన భక్తాంజనేయస్వామి ఆలయం

నేడు హనుమజ్జయంతి

ముస్తాబైన ఆలయాలు

అనంతపురం కల్చరల్, మే 31: హనుమద్ జయంతి సందర్భంగా శనివారం నిర్వహించనున్న వేడుకలకు జిల్లాలోని ఆంజనేయస్వామి ఆలయాలన్నీ సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. స్థానిక హౌసింగ్‌బోర్డులోని భక్తాంజనేయస్వామి దేవాలయం, నగరశివారు సోములదొడ్డిలోని అభయాంజనేయస్వామి దేవాలయం, మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, రెవెన్యూ కాలనీ రామాలయం, మారుతీనగర్‌లోని పంచముఖాంజనేయస్వామి దేవాలయం, పాతూరు వ్యాసరాజమఠం ఆవరణంలోని మూలాంజనేయస్వామి దేవాలయం, కోర్టు రోడ్డులోని వరదాంజనేయస్వామి దేవాలయం, పాతూరు మార్కెట్ వద్ద గల మండి ఆంజనేయస్వామి దేవాలయం... తదితర ఆలయాలన్నీ వేడుకలకు ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, షేమియానాలు ఏర్పాటు చేశారు. హౌసింగ్‌బోర్డు భక్తాంజనేయస్వామి ఆలయంలో గురువారం నుంచే హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండో రోజున శుక్రవారమూ భక్తాంజనేయస్వామి మూలవిరాట్‌కు ఫలపంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో హనుమద్ వ్రతం, సాయంత్రం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణాలు నిర్వహించారు.


పూజలందుకుంటున్న హనుమద్ సమేత సీతారామలక్ష్మణులు


హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు


అలంకరణలో స్వామివారు

మరువవంకలో మంటలు





అనంతపురం క్రైం, మే 31: ఇన్నాళ్లూ గుత్తి రోడ్డులోని డంపింగ్‌యార్డ్‌లో మంటలు లేచి.. పొగలు వ్యాపించేవి. శుక్రవారం మరువవంకలో మంటలు వ్యాపించాయంటే కాలువలో చెత్త ఎంత పేరుకుపోయిందో ఇట్టే అర్థమవుతుంది. అనంతపురం నగరంలో చెత్త సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఆఖరికి కాలువల్లో సైతం చెత్త పేరుకపోయి.. మంటలు వ్యాపిస్తున్నాయంటే పాలకులు, అనంతపురం కార్పొరేషన్ అధికారుల నిర్వహణ తీరు ఎంత ఎంత దౌర్భాగ్య పరిస్థితిలో ఉందో అర్థమవుతుంది. సూర్యానగర్ రోడ్డు పక్కనున్న మరువవంక కాలువలో శుక్రవారం ఇలా మంటలు వ్యాపించాయి.

ప్రశాంతతను జీర్ణించుకోలేకే విమర్శలు

- మేం చెబితే పోలీసులు, అధికారులు వింటారా..?
- ఎవరు ఎలాంటి వారో ప్రజలకు బాగా అర్థమైంది
- ఎమ్మెల్యే, అతని అనుచరులపై పరిటాల సునీత ధ్వజం


మీడియాతో మాట్లాడుతున్న పరిటాల సునీత

రామగిరి, మే 31: పోలీసులు, ఎన్నికల కమిషన్ నిజాయితీగా పనిచేయడంతో ఈ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయిని, దీన్ని ఎమ్మెల్యే జీర్ణించుకోలేకనే తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత ధ్వజమెత్తారు. శుక్రవారం వెంకటాపురంలో ఆమె మాట్లాడుతూ.. ఈ ఐదేళ్ల పోలీసులు ఎవరి కనుసన్నల్లో పనిచేశారో.. వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా ఎవరు వ్యవహరించారో.. అందరికీ తెలుసునని అన్నారు. తాము చెబితే పోలీసులు, ఎన్నికల అధికారులు వింటారా అంటూ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని ప్రశ్నించారు. తమ కనుసన్నల్లో పోలీసులు బైండోవర్ చేస్తున్నారని ఆరోపించడం తోపు, అతని అనుచరుల దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఎన్నికల కమిషన్, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించారు కాబట్టే రాప్తాడులో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయన్నారు. అనేకత సమస్యాత్మక గ్రామాలు ఉన్నప్పటికి పోలీసులు ముందు జాగ్రత్తలతో చిన్నగొడవ కూడా చేశారన్నారు. ప్రస్తుతం కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కొందరిని బైండోవర్ చేస్తున్నారన్నారు. ఎన్నికల తరువాత కొన్నిప్రాంతాల్లో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని బైండోవర్ చేస్తున్నారని, వైసీపీ వారిని మాత్రమే బైండోవర్ చేస్తున్నారని చెప్పడం సరికాదని, ఇందులో టీడీపీ వారు కూడా ఉన్నారని అన్నారు. తోపుదుర్తిలో ఎన్నికల ముందు చేసిన దాడులు, దౌర్జన్యాలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారని, అదే మద్దెలచెరువు తదితర సమస్యాత్మక గ్రామాల్లో కేవలం ఒక్క మహిళా పోలీసు మాత్రమే ఉందనేది మరచి పోవద్దన్నారు. 2019 ఎన్నికల తరువాత ఎమ్మెల్యేగా గెలిచి ఏ మేరకు ప్రజలకు అందుబాటులో ఉన్నావో ప్రజలకు బాగా అర్థమైందన్నారు. ఎవరు ఫ్యాక్షనిస్టులు, ఎవరు ప్రజలకు కనిపించకుండా పోయారో నియోజకవర్గ ప్రజలే చెబుతారన్నారు. కరోనా సమయంలో తోపు సోదరులు ఎక్కడ దాక్కున్నారో చెప్పాలన్నారు. తాము ఎప్పుడూ ప్రజలతో ఉన్నాము కాబట్టే తమకు ప్రజలు ఓట్లు వేశారని అన్నారు. ఓటమి భయంతో తోపు తన అనుచరులతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, నాయకులు మాదాపురం శంకర్ పాల్గొన్నారు.

ముగిసిన సంగీత శిక్షణ శిబిరం


కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్, మే 31: వేసవి సెలవుల నేపథ్యంలో స్థానిక అరవిందనగర్‌లోని డేనియల్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన సంగీత శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అరవిందనగర్‌లోని ఎవర్ షైన్ గ్లోరీ చర్చిలో మ్యూజిక్ టీచర్ అనీల్ కుమార్, సిస్టర్ హేమలత సంయుక్త అధ్యక్షతన ముగింపు సభను నిర్వహించారు. ఈ వేడుకకు పాస్టర్లు వినోద్‌కుమార్, బెంజిమన్ జాన్సన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాస్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. సంగీతం ద్వారా మానసిక ప్రశాంతతను పొందవచ్చన్నారు. అనంతరం చిన్నారులు నేర్చుకున్న పియానో, గిటార్ తదితర సంగీత పరికరాలతో తమ ప్రతిభను చాటుకున్నారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎవర్ షైన్ గ్లోరీ చర్చి పాస్టర్ పీటర్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

వార్డెన్ కంబయ్యకు సన్మానం


కంబయ్య దంపతులను సన్మానిస్తున్న డీడీ, ఏబీసీడబ్ల్యూఓలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 31: శింగనమల బాలికల వసతి గృహంలో బీసీ బాలుర నెం-2 హాస్టల్ వార్డెన్ కంబయ్య ఉద్యోగ విరమణ సభను శుక్ర వారం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూ కొఠారీ మాట్లాడుతూ... కంబయ్య శేష జీవితాన్ని కుటుంబసభ్యులతో ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ సూపరింటెండెంట్ నాగరత్నమ్మ, ఏబీసీడబ్ల్యూఓలు రంగమ్మ, సుభాషిణి, గంగాద్రి, రాజకుళ్లాయప్ప, సుబ్బరాయుడు, గంగాధర్, ఓబులేసు, బీసీ వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మస్తాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, గౌరవాధ్యక్షుడు మారుతి, అసోసియేట్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌నాయుడు, కోశాధికారి ఠాగూర్, పలువురు వార్డెన్లు, వసతిగృహాల వర్కర్లు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తాడిపత్రి ఆర్వో


శిరీష

అనంతపురం టౌన్, మే 31: జిల్లాలో అత్యంత సమస్యాత్మక నియోజకవర్గం తాడిపత్రిలో ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ శిరీష శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పోలింగ్‌రోజున మొదలైన ఘర్షణలు అధికారులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే పలువురు పోలీసు అధికారులు సస్పెండ్ అయ్యారు. తీవ్ర ఒత్తిళ్ల నేపథ్యంలో ఆర్వో రాంభూపాల్ రెడ్డి సెలవు కోసం ప్రయత్నించి.. చివరకు బదిలీ అయ్యారు. కౌంటింగ్‌కు కేవలం మూడురోజుల వ్యవధి ఉండటంతో ఆయన స్థానంలో ఓ ఐఏఎస్ నియమించాలని కలెక్టర్ వినోద్ కుమార్ భావించారు. కానీ ఇప్పటికే బాధ్యతలు ఎక్కువగా ఉన్నాయని, ఆర్వో బాధ్యతలు వద్దని చెప్పడంతో శిరీషను నియమించారని తెలిసింది. ఉరవకొండ ఏఆర్వోగా ఉన్న ఆమె సైతం తాడిపత్రికి బాధ్యతలు స్వీకరించేందుకు సంకోచించారని సమాచారం. సమయం తక్కువగా ఉందని, బాధ్యతలు చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారులు సూచించడంతో అంగీకరించినట్లు సమాచారం.

గొడవలకు దిగితే కఠిన చర్యలు

అనంతపురంరూరల్, మే 31: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎవరైన గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటశివారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ఇరుపార్టీల నాయకులతో అనంతపురం రూరల్ ఎస్ఐ రామకృష్ణారెడ్డితో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. విజయోత్సవ ర్యాలీ నిషేదమని అన్నారు. గెలుపోటములు సాధారణమని, ఎవరూ ఘర్షణలకు పాల్పడరాదని, అలాంటి వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.
రామగిరి : కౌంటింగ్ రోజులు గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం రామగిరిలో వివిధ రాజకీయ పార్టీల ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో మంగళవారం 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు ఎవరూ గుంపులుగా ఉండరాదని అన్నారు. సమావేశంలో సీఐ శివాంజనేయులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై పోటీలు


పోటీలో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం క్లాక్ టవర్, మే 31: ప్రపంచ పర్యావరణ దినోత్సవ నేపథ్యంలో స్థానిక శారదా నగర్‌లోని సైన్సు సెంటర్‌లో విద్యార్థులకు శుక్రవారం పలు పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలకు 90 మంది, పోస్టరు రూపకల్పన పోటీలకు 55 మంది, వక్తృత్వం పోటీలకు 42 మంది మొత్తం 187 మంది హాజరయ్యారు. వారిలో మొత్తం 22 మంది విజేతలను ఎంపిక చేశామని, వారి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5న (బుధవారం) నిర్వహించే వేడుకల్లో బహుమతులు అందజేస్తామని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీరు పెద్దిరెడ్డి కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్సు సెంటర్ అధికారి బాలమురళీకృష్ణ, ఎన్‌సీఎస్‌ఈ జిల్లా సమన్వయకర్త ఆనంద్ బాస్కర్ రెడ్డి, ఎన్‌జీసీ సమన్వయకర్త రాము, మేడా ప్రసాద్, వెంకటరంగయ్య, సూరిబాబు, సదాశివయ్య, సతీష్‌బాబు పాల్గొన్నారు.

రస్తా విషయంలో గొడవ.. ఒకరికి గాయాలు

శింగనమల మే 31: మండలంలోని తరిమెలలో రస్తా విషయంలో గొడవలో సుబ్బనరసయ్య తీవ్రంగా గాయపడ్డాడు. తరిమెల గ్రామానికి చెందిన సుబ్బనరసయ్యకు కల్లుమడి రెవెన్యూ పొలంలో సర్వేనెంబర్ 880లో మూడు ఎకరాలు భూమి ఉంది. ఈ పొలం పక్కనే తరిమెల గ్రామానికి చెందిన వెట్టి సురేష్ పొలం ఉంది. వీరి మధ్య రస్తా విషయంలో వివాదం ఉంది. శుక్రవారం మధ్యాహ్నం తరిమెలలో సుబ్బనరసయ్య, అతని భార్య అంగన్‌వాడీ కార్యకర్త నాగజ్యోతి ఇంటిలో ఉండగా... వెట్టి సురేష్ కట్టెతో వారిపై దాడి చేశాడు. సుబ్బనరసయ్య తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే అతన్ని శింగనమల ఆసుపత్రికి తరలించారు. అక్కడ అనంతరం అనంతపురం ఆసుప్రతికి తరలించారు. సుబ్బనరసయ్య కుమారుడు గిరి మాట్లాడుతూ.. వెట్టి సురేష్ గతంలో ఇలా దాడులు చేశాడని, సురేష్ నుంచి తమ కుటుంబానికి ప్రాణ హాని ఉందని వాపోయాడు. శింగనమల పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు నాగజ్యోతి తెలిపారు.

బడి ఈడు దివ్యాంగ చిన్నారులను గుర్తించండి

శింగనమల: మండలంలోని బడిఈడు దివ్యాంగుల పిల్లల గుర్తింపు కోసం ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు నరసింహరాజు, శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం శింగనమల భవిత కేంద్రం వద్ద నిర్వహించిన దివ్యాంగుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో సర్వే నిర్వహించి.. దివ్యాంగుల పిల్లలను గుర్తించి.. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఐఆర్పీలు భాగ్యలక్ష్మి, లోకేష్ దివ్యాంగులు పాల్గొన్నారు.

పొగాకు వాడకంతో అనర్థాలు అనేకం


అనంతపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది


సీకేపీలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎస్ గేటు ఆస్పత్రి సిబ్బంది

అనంతపురం టౌన్, మే 31: పొగాకు వాడకం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని, వాటి ఉత్తత్తులకు దూరంగా ఉండాలని ప్రజలకు వైద్యాధికారులు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా శుక్రవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పొగాకు ఉత్పత్తుల వాడటంతో కలిగే దుష్ప్రభావాలపై లఘు నాటికను వైద్యకళాశాలలో ఆ విద్యార్థులు ప్రదర్శించారు. పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై ఆస్పత్రిలో సైక్రియాట్ విభాగంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు పద్మజ, హేమలత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో నగరంలో అవగాహన ర్యాలీ చేపట్టారు.
చెన్నేకొత్తపల్లి: పొగాకు వాడకంతో కలిగే అనర్థాలపై ఎస్ఎస్‌గేటు ప్రభుత్వాస్పత్రి సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించింది. ప్రభుత్వాస్పత్రి నుంచి ఎస్ఎస్‌గేటు నాలుగు రోడ్ల కూడలి వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. వైద్యులు ఉదయ్ పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్నిపురస్కరించుకుని డాక్టర్ ఉదయ్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం ప్రభుత్వాస్పత్రి నుంచి ఎస్ఎస్‌గేటు నాలుగు రోడ్ల కూడలివరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్యుడు ఉదయ్, పీహెచ్ఎన్ పద్మావతి, సీహెచ్ఓ గోవిందమ్మ, సూపర్‌వైజర్లు వెంకటనారాయణ, రామలక్ష్మమ్మ, బాస్కర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో కడప హ్యాట్రిక్ విజయం


ప్రణీల్‌రెడ్డి, చరణ్‌జిత్

అనంతపురం క్లాక్‌టవర్, మే 31: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-19 వన్డే క్రికెట్ పోటీల్లో కడప జట్టు హ్యాట్రిక్ విజయం సాధించింది. శుక్రవారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ఈ క్రికెట్ పోటీలు కొనసాగాయి. అనంతపురం, చిత్తూరు జట్ల మధ్య జరగగా... మొదట బ్యాటింగ్ చేసిన చిత్తూరు 48.2 ఓవర్లలో 232 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం 48.5 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌట్ అయ్యింది. చిత్తూరు ప్లేయర్ చరణ్‌జిత్ 56 పరుగులు, రెండు వికెట్లు తీసి ఆల్ రౌండర్ షోతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. మరో మ్యాచ్‌లో... కడప, నెల్లూరు జట్లు తలపడగా.. మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు 40.5 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన కడప 40 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసి ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. కడప జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన సెంచరీ కొట్టిన ప్రణీల్‌రెడ్డి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, కోచ్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో తప్పులు చేస్తే కఠిన చర్యలు: జేసీ

అనంతపురం టౌన్, మే 31: కౌంటింగ్ పక్రియలో ఎక్కడ ఎలాంటి తప్పులు జరిగినా అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్ హెచ్చరించారు. శుక్రవారం జేఎన్‌టీయూలోని అడ్మిన్‌బ్లాక్‌లో ఏర్పాటు చేసిన ఉరవకొండ కౌంటింగ్ కేంద్రానికి నియమించిన సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్ సిబ్బంది సరైన సమయా నికి హాజరుకా వాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా గుర్తింపుకార్డు ధరించి డ్యూటీకి రావాలన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉంటుందని, ఈ ఓట్ల లెక్కింపునకు అదనపు ఆర్ఓ అధికారులను నియమించామని తెలిపారు. ఉరవకొండ నియోజకవర్గానికి 18 కౌంటింగ్ టేబుల్స్, 15రౌండ్లు, పార్లమెంటు ఓట్లకు మాత్రం 14 టేబుల్స్ 18 రౌండ్లు కౌంటింగ్ ఉంటుందన్నారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్స్, ఈటీపీబీఎస్ ఓట్లను ఎలా లెక్కించాలో అవగాహన కల్పించారు.


శిక్షణలో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు


ఎం.నారాయణప్ప దంపతులను సన్మానిస్తున్న కాలేజీ సిబ్బంది, కుటుంబ సభ్యులు

శింగనమల : ఉద్యోగులు విధులను అంకితభావంతో నిర్వహిస్తేనే మంచి గుర్తింపు వస్తుందని రిటైర్డ్ ఆర్ఐఓ సురేష్‌బాబు అన్నాడు. శుక్రవారం శింగనమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టైపిస్ట్ ఎం.నారాయణప్ప ఉద్యోగ విరమణ సందర్భంగా ఆ కళాశాలలో ఆ దంపతులకు సన్మాన సభ నిర్వహించారు. సురేష్‌బాబుతో పాటు రిటైర్డ్ పిన్సిపాల్ అంకిరెడ్డి, పిన్సిపాల్ షఫీ, అధ్యాపకులు, గతంలో ఇక్కడ పనిచేసిన సిబ్బంది, టీడీపీ నాయకుడు కంబగిరి రాముడు, బంధువులు, కుటుంబ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు.

ఎస్కేయూ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక


జట్టుకు ఎంపికైన విద్యార్థులతో వీసీ హుస్సేన్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్, మే 31: ఎస్కేయూ బ్యాడ్మింటన్ బాలుర జట్టును ఎంపిక చేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ సెక్రెటరీ శ్రీనివాసన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం వీసీ హుస్సేన్‌రెడ్డి క్రీడా దుస్తులను అందజేసి అభినందించారు. ఈ సందరర్భంగా శ్రీనివాసన్ మాట్లాడుతూ... చెన్నై జేపీయార్ వర్సిటీలో శనివారం నుంచి మంగళవారం వరకు నిర్వహించే పోటీల్లో ఎస్కేయూ తరఫున ఈ జట్టు పాల్గొంటుందన్నారు.

రీ వెరిఫికేషన్‌లోనూ అదే నిర్లక్ష్యం

అనంతపురం విద్య, మే 31: పదో తరగతి పరీక్షల్లో తన కుమార్తెకు మార్కులు తగ్గాయని, రీ వెరిఫికేషన్‌కు పెట్టినా అధికారులు అదే నిర్లక్ష్యం చూపారని విద్యార్థిని ఎస్.సైమా తండ్రి శుక్రవారం వాపోయాడు. సైన్స్ పేపర్ -1 పరీక్షలో తన కుమార్తెకు 45 మార్కులు వేశారని, దీంతో రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్నామని, అందులో నాలుగు మార్కులు తక్కువగా వేసినట్లు గుర్తించామని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా పరీక్షల విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఆ సమస్య పరిష్కారం వారి పరిధిలో లేదని, బోర్డు దృష్టికి తీసుకెళ్లాలని వారు సూచించారని వాపోయారు.

వైద్య విద్యార్థికి రూ.75 వేలు ఆర్థికసాయం

అనంతపురం కల్చరల్ : నీట్- 2023 బ్యాచ్‌లో ప్రతిభ చాటుకుని ఉచిత మెడికల్ సీట్ పొందినప్పటికీ హాస్టల్ మెస్ చార్జీలు, పుస్తకాల కొనుగోలు కోసం ఇబ్బంది పడుతున్న వైద్య విద్యార్థికి అమ్మ సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. నగరంలోని 3వ మూడో రోడ్డులో జీఆర్ ఫంక్షన్ హాల్‌వద్ద నివాసముంటున్న రైతు ప్రసన్నకుమార్‌రెడ్డి కుమారుడు వరుణ్ కార్తీక్ రెడ్డి నీట్‌లో జాతీయస్థాయిలో 7041, రాష్ట్రస్థాయిలో 281వ ర్యాంక్ సాధించాడు. విశాఖ పట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఉచిత సీట్‌ను పొందాడు. అయితే వారిది పేద కుటుంబం కావడంతో హాస్టల్‌లో మెస్ చార్జీలు, పుస్తకాల కొనుగోలు కోసం ఇబ్బందులు పడుతున్నాడు. వారు అమ్మ సంస్థను ఆశ్రయించగా శుక్రవారం అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి ఆ కుటుంబాన్ని కలిసి రూ.75వేలు అందించారు. వరుణ్ కార్తీక్ రెడ్డి ఎంబీబీఎస్ పూర్తి చేసేవరకు అతని మెస్ చార్జీలు పూర్తిగా భరిస్తామని హామీ ఇచ్చారు.

ఇంత రేటైతే ఎట్లబ్బా కొనేది ?



రాయదుర్గం, మే 31: సాధారణంగా మసాలా కూరల్లోకి కొత్తిమీర వేస్తే దాని టేస్టే మరో లెవల్లో ఉంటుందని భోజనప్రియులు చెబుతుంటారు. అందుకే సీజన్‌తో సంబంధం లేకుండా కొత్తిమీరకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. ధర కూడా సామాన్యంగానే ఉంటుంది. అయితే కొద్ది రోజులుగా పెరుగుతున్న ధరలతో కొత్తిమీర పేద, మధ్యతరగతి వర్గాలను భయపెడుతోంది. రెండు రోజుల కిందటి వరకు రూ. 10లకు మూడు కట్టలు ఇచ్చేవారు. ఇప్పుడు రూ.20కి కట్ట మాత్రమే ఇస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సాగు చేసిన కొత్తిమీర అంతా కొట్టుకుపోయింది. ఇప్పుడు సాగుచేసిన కొత్తిమీర కోతదశకు రావాలంటే కనీసం 20 రోజులు పడుతుంది. ఈక్రమంలో వ్యాపారులు కర్ణాటక వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. అక్కడ కూడా ధరలు విపరీతంగా ఉండటంతో అరకొరగానే తెచ్చుకుని ఇక్కడ అమ్ముకుంటున్నారు. రాయదుర్గం కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం కట్ట కొత్తిమీర రూ. 20లు పలికింది. పుదీన రేటు కూడా మార్కెట్‌లో రూ.20లకు చేరింది.

మెడికల్ షాపుల్లో తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

డీ.హీరేహాళ్, మే 31: మండల కేంద్రంలోని పలు మందుల దుకాణాలు, ప్రథమ చికిత్స కేంద్రాలను వైద్యాధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య విద్య బోధకుడు కెంచె లక్ష్మీనారాయణ ఈ తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ షాపులు, ప్రథమ చికిత్స కేంద్రాలలో అనుమతులు లేకుండానే డాక్టర్ల పేరుతో వైద్యం అందిస్తూ భారీ మొత్తంలో యాంటీబయాటిక్స్ ఇతర మందులను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అనుమతులు లేకుండానే మెడికల్ షాపులను నడుపుతున్నట్లు కూడా గుర్తించారు. అలాంటి వాటికి నోటీసులు జారీ చేశారు. ఆర్ఎంపీ ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని, విచ్చలవిడిగా అనుమతులు లేని మందులు విక్రయింపజేసి, వైద్యం చేయరాదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

భారీ మోటార్ల ద్వారా నీటిని పంప్ చేయాలి

గుంతకల్లుటౌన్, మే 31: మండలంలోని జీ కొట్టాల గ్రామ సమీపంలోని హంద్రీ నీవా కాలువ నుంచి మున్సిపాలిటీ రిజర్వాయర్లకు 500 హెచ్‌పీ మోటర్ల ద్వారా నీటిని పంపింగ్ చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి గోపినాథ్ పేర్కొన్నా రు. స్థానిక సీపీఐ ఆధ్వర్యంలో రిజర్వాయర్లను సీపీఐ నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500 హెచ్‌పీ మోటర్ల ద్వారా 35రోజుల్లో ఒక రిజర్వాయర్‌ను పూర్తిగా నీటితో నింపవచ్చునని, ఆ దిశగా మున్సిపల్ అధికారులు పనులను ప్రారంభించాలని కోరారు. సత్యనారాయణ పేట సమీపంలో మురుగు నీటి శుద్ధి ప్లాంట్ పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాము, మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు మురళీకృష్ణ, ప్రసాద్, రాజకుమార్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

యల్లనూరు, మే31: ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్ట్యా మండలంలోని యల్లనూరు, తిమ్మంపల్లి, కల్లూరు గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు. వీటికి సంబంధించిన మానిటరింగ్ జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఉంటుందన్నారు. కౌంటింగ్ రోజు భద్రతా చర్యల్లో భాగంగా వీటిని జిల్లా కేంద్రం నుంచి పంపించినట్లు ఆయన తెలిపారు.

ఎస్కేయూ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

అనంతపురం సెంట్రల్, మే 31: ఎస్కేయూ బ్యాడ్మింటన్ బాలుర జట్టును ఎంపిక చేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ సెక్రెటరీ శ్రీనివాసన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం వీసీ హుస్సేన్‌రెడ్డి క్రీడా దుస్తులను అందజేసి అభినందించారు. ఈ సందరర్భంగా శ్రీనివాసన్ మాట్లాడుతూ... చెన్నై జేపీయార్ వర్సిటీలో శనివారం నుంచి మంగళవారం వరకు నిర్వహించే పోటీల్లో ఎస్కేయూ తరఫున ఈ జట్టు పాల్గొంటుందన్నారు.

పోలీసు బలగాల కవాతు



పుట్లూరు రోడ్డులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తాడిపత్రిటౌన్, మే31: కౌంటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడడానికి పట్టణంలో శుక్రవారం పోలీసు బలగాలతో కవాతు నిర్వహించినట్లు డీఎస్పీ జనార్దన్‌నాయుడు తెలిపారు. పట్టణంలోని మెయిన్‌బజారు, గాంధీకట్ట, పుట్లూరురోడ్డు పోరాటకాలనీ, నంద్యాలరోడ్డు, సీబీరోడ్డు మీదుగా కవాతు నిర్వహించినట్లు తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా 300మంది పోలీసులు, ఏపీఎస్పీ బలగాలు 160మంది, ర్యాపిడ్ ఫోర్స్ 120మందిని రప్పిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

గుత్తిరూరల్, మే 31: మండలంలోని తురకపల్లి గ్రామంలో శుక్రవారం లక్ష్మిదేవి (40) ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మీదేవి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేదని బంధువులు తెలిపారు. పలు చోట్ల చికిత్స చేయించిన ఫలితం లేకపోవడంతో మనస్తాపం చెందింది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కి ఉరి వేసుకుంది. కొద్దిసేపటి తర్వాత గమనించిన బంధువులు ఉరికి వేలాడుతున్న ఆమెను కిందకు దింపి పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సంతానం కలగలేదని..

యాడికి: సంతానం కలగలేదన్న మనస్తాపంతో గీత (26) ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి యాడికిలో జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు యాడికిలోని హాస్పిటల్‌కాలనీకి చెందిన కరుణాకర్, గీత దంపతులు పవర్‌లూమ్ మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నారు. వివాహమై ఆరేళ్లు గడిచినా సంతానం కలగకపోవడంతో శుక్రవారం సాయంత్రం ఇంటివద్ద ఎవరూలేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీ



పుట్లూరు రోడ్డులో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

తాడిపత్రి టౌన్, మే31: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పట్టణంలోని యల్లనూరురోడ్డు, పుట్లూరురోడ్డు, కడపరోడ్డులో శుక్రవారం సీఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీలు చేశారు. అనుమానం ఉన్న వాహనదారులను ఎక్కడికి ఏ పని మీద వెళుతున్నారని ఆరాతీశారు. మరికొందరిని గుర్తింపు కార్డులు చూసిన తర్వాత పంపుతున్నారు.

అధనంగా అమ్మకాలు

కౌంటింగ్ నేపథ్యంలో మూడురోజులు మద్యం షాపుల బంద్
ముందు జాగ్రత్తగా హోల్‌సేల్‌గా కొంటున్న వైనం
జేబులు నింపుకుంటున్న దుకాణాల నిర్వాహకులు



రాయదుర్గం, మే 31: ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడేకొద్దీ మద్యం దుకాణాలలో పని చేసే సిబ్బందిలో కొందరికి పండుగ వాతావరణం నెలకొంది. కమీషన్లు పుచ్చుకుని మద్యం హోల్‌సేల్ అమ్మకాలకు తెరలేపారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జూన్ 3, 4, 5వ తేదీలలో మద్యం దుకాణాలను మూసివేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో ఎన్నికల్లో పోటీ చేసిన పార్టీల నాయకులు, కార్యకర్తలు సంబరాలను జరుపుకోవడానికి తగినంత మద్యాన్ని ఇప్పటి నుంచే కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. మద్యం దుకాణాల్లో ఒక్కొక్కరికి మూడు బాటిళ్లు మాత్రమే పరిమితి ఉండటంతో సిబ్బందిని బుట్టలో వేసుకుని వ్యవహారాన్ని చక్కదిద్దుతున్నారు. తగినంత మద్యం తమకు అమ్మేలా ఒప్పందం చేసుకుని కొంతసొమ్ము అ'ధనం'గా ముట్టజెప్పి లోబర్చుకుంటున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో 15 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో తక్కువ మోతాదులో స్టాక్‌ను దింపుతున్నారు. కానీ దింపిన స్టాక్ విక్రయించడానికి ముందే కొందరు కన్నేసి హోల్‌సేల్ కొనుగోలుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా కొందరు వైసీపీ శ్రేణులు దీనికి తెరలేపి కొనుగోలును జోరుగా సాగిస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు నాయకులు కొనుగోలు చేసేందుకు వెళ్లినప్పటికీ సిబ్బంది ఒప్పందం ప్రకారం వైసీపీకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. రాత్రి పూట షాప్ బంద్ చేసే సమయానికి గ్రామాల నుంచి వచ్చిన వారు ఒప్పందం ప్రకారం వీటిని గోనెసంచుల్లో వేసుకుని పెద్ద సంఖ్యలో తరలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మద్యం దుకాణాల్లో ఈ తతంగం జోరుగా సాగుతోంది. పై అధికారులు దీనిపై నిఘా ఉంచి కట్టడి చేయాల్సిన నేపథ్యంలో సిబ్బంది కొరత కారణంగా గాలికి వదిలేసినట్లు తెలుస్తోంది. దీంతో మద్యం అమ్మకాలు జరిపే సిబ్బంది ఆడిందే ఆటగా వ్యవహారం సాగుతోంది.

ఎమ్మార్పీపై రూ.20 అధికం

సాధారణంగా ప్రభుత్వ పర్యవేక్షణలో సాగుతున్న మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీకే విక్రయించాలని ఉత్తర్వులు ఉన్నాయి. కానీ అవకాశాన్ని బట్టి కొందరు సిబ్బంది ఎమ్మార్పీపై ఎక్కువ సొమ్ము వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న షాపులలో ఈ వ్యవహారం జోరుగా సాగిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వైసీపీ నాయకులు కొందరు సిబ్బందితో ఒప్పందం పెట్టుకుని స్టాక్ రాగానే వారికి సమాచారం అందించి అప్పగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. డీ.హీరేహాళ్, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట మండలాల్లో ఉన్న షాపుల వద్ద పెద్దగా ప్రభావం కనిపించడం లేదు. కర్ణాటక సరిహద్దులో అక్కడి మద్యం దుకాణాలు కూతవేటు దూరంలో ఉండటంతో చీప్ లిక్కర్‌ను తక్కువ ధరకు తెచ్చుకుని చాలాచోట్ల స్టాక్ పెట్టుకుంటున్నట్లు తెలిసింది. కొన్ని గ్రామాల్లో బెల్ట్‌షాపులను ఏర్పాటు చేసుకుని కర్ణాటక చీప్ లిక్కర్‌ను విక్రయించి కొందరు వైసీపీ కార్యకర్తలు జీవనోపాధి పొందుతున్నట్లు బలంగా ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయాల ప్రభావం ఉండదు. దీంతో అక్కడ కాకుండా మిగిలిన చోటంతా మద్యం దుకాణాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఆమిద్యాలకు పయనమైన ఉత్సవమూర్తులు



ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఉరవకొండ, మే 31: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ నెల 21 నుంచి ఉత్సవాలు వైభవంగా సాగాయి. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఊరేగింపుగా ఆమిద్యాలకు తీసుకెళ్లారు. ఉత్సవాలు పూర్తయిన తర్వాత ఉత్సవమూర్తులను ఆమిద్యాలకు తీసుకెళ్లడం ఆనవాయితీ. ఆమిద్యాలలోని పెన్నోబులేశుడి ఆలయంలో ఉత్సవ విగ్రహాలను ఉంచుతారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ్‌కుమార్, అర్చకులు ద్వారకనాథాచార్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొగరహిత సమాజాన్ని నిర్మిద్దాం



కొళగానిహళ్ళిలో వైద్య సిబ్బంది, విద్యార్థుల ర్యాలీ



కుందుర్పిలో వైద్య సిబ్బంది, విద్యార్థుల ర్యాలీ

బొమ్మనహాళ్, మే 31: పొగరహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాభార్గవి అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా మండలంలోని శ్రీధరఘట్ట, కొళగానహళ్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సూపర్‌వైజర్ ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, వెంటరమణ, ఆవావర్కర్లు పాల్గొన్నారు.

కుందుర్పి: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలకేంద్రంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారులు డాక్టర్ అనూష, డాక్టర్ చాంద్ బేగం, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, పొగాకు వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైకల్యం గల పిల్లల గుర్తింపునకు సర్వే

పుట్లూరు, మే31: మండలం 0-18 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి శారీరక, మానసిక వైకల్యం కలిగినవారిని సమగ్రశిక్ష ఆధ్వర్యంలో గుర్తిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో దివ్యాంగులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాళ్లు, చేతులు సరిగ్గా లేని పిల్లలకు భవితకేంద్రం (పుట్లూరు-2 ప్రాథమిక పాఠశాలలో)లో ఉచితంగా ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే జూన్ 9వరకు నిర్వహిస్తామని, ఇప్పటికే 26మందిని గుర్తించినట్లు తెలిపారు.

హనుమజ్జయంతికి ఆలయాల ముస్తాబు

పుట్లూరు, మే31: మండలంలోని పుట్లూరు, ఏ. కొండాపురం, తక్కళ్లపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించే హనుమజ్జయంతికి ఆలయాలను ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా టెంకాయ, మామిడి ఆకులతో తోరణాలు కట్టారు. శనివారం ఉదయం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

20 మంది బైండోవర్

బెళుగుప్ప, మే 31: మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన ఇరు పార్టీల నాయకులు 20 మందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ శివ శుక్రవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రాజకీయ నాయకులను బైండోవరు చేసి మండల మేజిస్ట్రేట్ హరనాథ్‌రావు ఎదుట హాజరు పరిచామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఆరు నెలల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధించడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

రైలు నుంచి జారి పడి గాయాలు

పెద్దపప్పూరు, మే31: మండలంలోని జూటూరు రైల్వేస్టేషన్ వద్ద తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన షణ్ముఖ ప్రమాదవశాత్తు రైలు నుంచి జారీ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడని ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు. షణ్ముఖను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

గ్రామాల్లో కార్డెన్ సెర్చ్

పెద్దపప్పూరు, మే31: మండలంలోని జూటూరు, తిమ్మనచెరువు గ్రామాల్లో శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు. అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లల్లో, గడ్డివాముల్లో సోదాలు నిర్వహించారు.

రబీ పెట్టుబడి రాయితీ కోసం నివేదిక

యాడికి, మే31: రబీలో పెట్టుబడి రాయితీ కోసం నివేదిక పంపినట్లు ఏఓ మహబూబ్‌బాషా తెలిపారు. రబీ-2023 సీజన్‌లో మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినందున వర్షాభావ పరిస్థితుల వల్ల దెబ్బతిన్న పంటలకు రైతుల జాబితాను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. పెట్టుబడి రాయితీ మంజూరు కోసం నివేదికలను ప్రభుత్వానికి సమర్పించామన్నారు. మండలవ్యాప్తంగా 701మంది రైతులు 921.56 హెక్టార్లలో దాదాపుగా రూ.92లక్షల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు ఏఓ తెలిపారు.

మధ్యాహ్న భోజన తయారీదారులకు శిక్షణ



శిక్షణలో వండిన పదార్థాలను పరిశీలిస్తున్న ఎంఈఓ మల్లికార్జున, సీఆర్పీలు (బొమ్మనహాళ్)

బొమ్మనహాళ్, మే 31: మండలంలోని వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న వారికి బొమ్మనహాళ్ జిల్లా పరిషత్ హైస్కూల్లో ఒక రోజు శిక్షణ శుక్రవారం నిర్వహించారు. శిక్షణలో ఎంఈఓ 2 మల్లికార్జున తాజ్‌హోటల్ వాళ్ల వంటలపై చేసిన పీపీటీని ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టే మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన వంటలు వండి వడ్డించాలని సూచించారు. ఈ శిక్షణలో 49 పాఠశాలల వంట ఏజెన్సీలు పాల్గొన్నారు. వంట ఏజెన్సీలకు వంటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ట్రైనర్ హోసూరమ్మ, పీఆర్జీ రామాంజనేయులు, సీఆర్పీలు అమరేష్, భాస్కర్, ఇస్మాయిల్, యూ రామాంజినేయులు, మంజు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: మండలంలోని ఎమ్మార్సీలో శుక్రవారం మధ్యాహ్న భోజన హెల్పర్లకు, వంటవారికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమం లో భాగంగా 35పాఠశాలలకు సంబంధించిన వారికి వంటల పోటీలు నిర్వహించగా 10మందిని ఎంపిక చేసి వారికి బహుమతులు అందించినట్లు ఆయన తెలిపారు.

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకం కుక్ అండ్ హెల్పర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 45పాఠశాలలకు చెందిన కుక్ కం హెల్పర్లు స్వయంగా చేసిన మధ్యాహ్న భోజన శాంపిళ్లను ప్రదర్శించారు. శాంపిళ్లను ప్రధానోపాధ్యాయుల కమిటీ పరిశీలించి ప్రతిభ చూపిన ఆరుగురికి బహుమతులను అందించారు.

బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న గుండ్లపల్లి చాంద్‌బాషా, బెళుగుప్ప తిమ్మప్ప

బెళుగుప్ప, మే 31: మండలంలోని బెళుగుప్ప, వెంటాద్రిపల్లి గ్రామాల మధ్య శుక్రవారం రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బెళుగుప్పకు చెందిన తిమ్మప్ప శీర్పికి వెళ్లి స్వగ్రామానికి బైకుపై వస్తుండగా గుండ్లపల్లికి చెందిన చిరు వ్యాపారి చాంద్‌బాషా ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తు ఢీకొంది. ప్రమాదంలో తిమ్మప్ప తలకు గాయాలు కావడంతోపాటు చేయి, కాలు విరిగింది. చాంద్‌బాషా తలకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో బెళుగుప్ప పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్సలు చేశారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



సందీప్ (ఫైల్)

కళ్యాణదుర్గంరూరల్, మే 31: మండలంలోని మల్లిపల్లి గ్రామానికి చెందిన గొల్ల సందీప్(30) గురువారం అర్ధరాత్రి కర్ణాటకలోని గౌరీబిదనూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు గొల్ల సందీప్‌కు గౌరీబిదనూరుకు చెందిన ప్రియతో దాదాపు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. దీంతో సందీప్ అక్కడే అత్తవారి ఇంట్లో నివాసం ఉంటున్నాడు. గౌరీబిదనూరుకు సమీపంలో ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్లో అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల అనంతరం పట్టణానికి తన కారులో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం గౌరీబిదనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం స్వగ్రామమైన మల్లిపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అల్లుడు దేవినేని అవినాష్ సందీప్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గౌరీబిదనూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కౌంటింగ్‌లో తప్పులు జరిగితే చర్యలు: ఆర్వో

ఉరవకొండ, మే 31: కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి తప్పులు జరిగినా కఠినచర్యలు తీసుకుంటామని ఆర్వో, జేసీ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. అనంతపురం లోని జేఎన్‌టీయూలో ఉరవకొండ నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ సిబ్బందికి శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల లెక్కింపుపై అవగాహన కల్పించారు. కౌంటింగ్ సిబ్బంది లెక్కింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నియోజకవర్గానికి సంబంధించి 18టేబుళ్ల, 15రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. కౌంటింగ్‌కు హాజరయ్యే సిబ్బంది గుర్తింపు కార్డుతోనే రావాలన్నారు. మొబైల్‌ఫోన్లు అనుమతించరన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ జరుగుతుందని, ఈ ఓట్ల లెక్కింపుకు అదనపు రిటర్నింగ్ అధికారిని నియమించినట్లు వెల్లడించారు.

నిబంధనలు పాటించాల్సిందే



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఓ శిరీష

తాడిపత్రిటౌన్, మే31: కౌంటింగ్‌లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శిరీష తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏజెంట్ల వివరాలను ఆయా పార్టీల నాయకులు జూన్ 1లోపు తమకు అందజేయాలన్నారు. నాలుగున ఉదయం 6గంటలకు ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. కేంద్రంలో ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తేవాలన్నారు. అనంతరం సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె ఈవీఎంలను ఓపెన్ చేయడం, కౌంటింగ్ చేయడం తదితర వాటిపై అవగాహన కల్పించారు. సమావేశంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్రప్రసాద్, రాజా పాల్గొన్నారు.

రీ వెరిఫికేషన్‌లోనూ అదే నిర్లక్ష్యం

అనంతపురం విద్య, మే 31: పదో తరగతి పరీక్షల్లో తన కుమార్తెకు మార్కులు తగ్గాయని, రీ వెరిఫికేషన్‌కు పెట్టినా అధికారులు అదే నిర్లక్ష్యం చూపారని విద్యార్థిని ఎస్.సైమా తండ్రి శుక్రవారం వాపోయాడు. సైన్స్ పేపర్ -1 పరీక్షలో తన కుమార్తెకు 45 మార్కులు వేశారని, దీంతో రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్నామని, అందులో నాలుగు మార్కులు తక్కువగా వేసినట్లు గుర్తించామని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా పరీక్షల విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఆ సమస్య పరిష్కారం వారి పరిధిలో లేదని, బోర్డు దృష్టికి తీసుకెళ్లాలని వారు సూచించారని వాపోయారు.

వీఆర్ఏ కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఆర్ఐ నగేష్, వీఆర్ఏలు

బెళుగుప్ప, మే 31: మండలంలోని శీర్పి తలారి మహేష్ (35) బ్రెయిన్ స్ట్రోక్‌తో శుక్రవారం మృతి చెందాడు. డీటీ హుస్సేన్‌పీరా, ఆర్ఐ నగేష్, వీఆర్వోలు శీర్పి యర్రిస్వామి, వీరాంజనేయులు, యర్రిస్వామి, వీఆర్ఏలు ఓబుళప్ప, మహేంద్ర, సిద్ద, తదితరులు పరామర్శించి అంత్యక్రియలకు రూ. 25 వేలు ఆర్థిక సాయం అందించి సంతాపం తెలిపారు. మృతుడికి భార్య తేజస్విని, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

నేడు పింఛన్ సొమ్ము జమ

యాడికి, మే31: సామాజిక పెన్షన్ల సొమ్ము జూన్ నెలకు సంబంధించి శనివారం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమకానున్నట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. మండలవ్యాప్తంగా 8044మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరికి రూ.2,41,58,500 సొమ్ము చెల్లించనున్నట్లు తెలిపారు. వీరిలో 5440మంది లబ్ధిదారులకు బ్యాంక్ ఖాతాల్లో మొత్తం జమ అవుతుందన్నారు. మిగిలిన వారికి ఇంటివద్దకు వెళ్లి పింఛన్ అందిస్తామని ఆమె తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

గుంతకల్లుటౌన్, మే 31: పట్టణంలోని శ్రీ విశ్వవిజ్ఞాన్ పాఠశాలలో శుక్రవారం ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రి, కర్నూలులోని శాంతిరాం ఆసుపత్రికి చెందిన వైద్యులు 150 మందికి పరీక్షలు నిర్వహించారు. కంటికి 25 మంది, 35 మంది గుండె ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ విశ్వనాథ్, సభ్యులు రమేష్, కసాపురం రామాంజినేయులు, కప్పట్రాళ్ల కోటేశ్వరరావు. వీరాంజనేయులు, తరుణ్, నరసింహులు, నాగమణి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సురేంద్రబాబు గెలవాలని పూజలు



ముత్యాలమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

కుందుర్పి, మే 31: మండలంలోని బోదపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బొమ్మన్న, శ్రీనివాసులు, లింగరాజులు శుక్రవారం నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై సమీక్ష

రాయదుర్గం, మే 31: మండలంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల జియో ట్యాగింగ్‌పై సమీక్ష సమావేశం నిర్వహించినట్లు ఈఓఆర్డీ రంగనాయకులు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై 15వ ఆర్థిక సంఘం స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా విడుదల చేసిన నిధులు వాడకంపై జియో ట్యాగింగ్ నిర్వహించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గూగుల్ మ్యాప్ ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్లను సర్వే చేశారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, భీమేష్, కొల్లప్ప, శ్రీదేవి పాల్గొన్నారు.